నిరుపయోగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- కోట్ల రూపాయలు వృథా అంటున్న స్థానికులు
- ఉపయోగపడే విధంగా చేయాలంటున్న ప్రజలు

అలంకారప్రాయంగా కాటేదాన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి



మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారులు దాటుతూ తరుచు ప్రమాదాలు చోటు చేసుకొకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. సుమారు 2 నుంచి 3 కోట్లు ఖర్చు పెట్టి అందులో వృద్ధులు మెట్లు ఎక్కకుండా లిఫ్ట్ సైతం ఏర్పాటు చేశారు. కొన్ని ఏరియాలో ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు పాదచారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అయితే కొన్ని చోట్ల మాత్రం ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ స్వప్న థియోటర్ ముందు 3.5 కోట్ల రూపాయలతో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మేయర్ గద్వాల విజయలక్ష్మి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా ప్రాంరభించారు. ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్న ప్రజలు దానిని వినియోగించకపోవడంతో కొందరు ఈ రోడ్డుపై అడ్డంగా ఎందుకు ఏర్పాటు చేశారని అనుకుంటున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుచేశాక ప్రధాన రోడ్డుపై, డివైడర్‌ను పాదాచారులు దాటకుండా ఇనుప రేయిలింగ్ వేయాలి. జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డు మధ్యలో పల్లెచెరువు నుంచి గగన్ పహాడ్ వరకు రెయింలింగ్ వేశారు. కాని స్వప్న థియోటర్ దగ్గరలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి ముందు ఏర్పాటు చేయాలేదు. కాటేదాన్ చౌరస్తా మంచి వ్యాపార సముదాయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారి కావడంతో పలు మార్లు ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం పాగోట్టుకున్నారు. దీంతో ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుందని ప్రమాదాలు చోటు చేసుకొకుండా ఉంటాయనే ఉద్యేశంతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చోరువతో కోట్ల రూపాయలతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. మరి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కాలంటే ప్రధాన రహదారిపై డివైడర్ ఇనుప రెలింగ్‌తో మూసివేస్తేనే పాదచారులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వినియోగిస్తారని ప్రజలు అంటున్నారు. దీంతో చౌరస్తాలో ట్రాఫిక్ తగ్గుతుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు గుర్తించి కాటేదాన్ చౌరస్తాలో డివైడర్ మూసివేయాలని కోరుతున్నారు.



ఫుట్ ఓవర్ బ్రిడ్జి ముందు డివైడర్ వేయకపోవడంతో పాదచారులు రోడ్డుపై నుంచే సాఫీగా వెళ్తున్నారు

“ ఇనుప చువ్వలతో డివైడర్ నిర్మించాలి



కాటేదాన్ చౌరస్తాలో కోట్ల రూపాయలతో నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది. అది ఉపయోగకరంగా మారాలంటే స్వప్న థియోటర్ ముందు డివైడర్ వేయాలి. చౌరస్తాలో డివైడర్ వేయకపోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. - ఎల్ వీ రెడ్డి టీఎస్జీవోస్ కాలనీ

నిరుపయోగంగా ఉన్నది వాస్తవమే



ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి కాటేదాన్ చౌరస్తాలో డివైడర్ మూసి వేస్తే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉపయోగకరంగా ఉంటుందని అనుకుంటున్నాం. పై అధికారులతో చర్చించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉపయోగపడే విధంగా కృషి చేస్తాం. డివైడర్ మూసివేయడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగే అవకాశాలు ఉన్నాయి.

- ఎం నర్సింహగౌడ్,
రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు తెలిపిన నరేందర్

శంషాబాద్: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్‌లు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాతబస్తీ అభివృద్ధికి అక్బరుద్దీన్ కృషి

చార్మినార్: ఎమ్మెల్యేగా డబుల్ హాట్రిక్ సాధించిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీని పురానాపూల్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రమోద్‌కుమార్ జైన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ జైన్ మాట్లాడుతూ, అక్బరుద్దీన్ ఒవైసీ కేవలం చాంద్రాయణగుట్ట నియోజక వర్గంలోని ప్రజల సంక్షేమం కోసమే కాకుండా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి పాతబస్తీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నారని ప్రమోద్‌కుమార్ జైన్ అన్నారు.

ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలి



బూత్‌స్థాయి అధికారులతో సమావేశమైన డీసీ రవి కుమార్

అత్తాపూర్: ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగంగా బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవి కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఓలకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ నమోదు, చిరునామాల మార్పు, నకిలీ ఓటర్ కార్డు తొలగింపు తదితర విషయాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు. బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్‌లో రాజురెడ్డి ఆధ్వర్యంలో ఆనంద్ గురుస్వామి నేతృత్వంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఎంతో వైభోపేతంగా పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, హారతులతో మెట్టుమెట్టుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణతో ఆప్రాంతం మార్మోగింది. ఈ మహాపడిపూజలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్‌రెడ్డి గురుస్వామి, శివస్వామి, సన్నిస్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సన్మానం



స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను మంగళవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు తల్లారి ప్రేమ్‌కుమార్, ఎ-బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్‌కుమార్, అంకం శ్రీనివాస్, గణేష్, బాబురావు, కుమార్ మదర్‌వల్లి, విక్కీ తదితరులున్నారు.

స్పీకర్‌కు శుభాకాంక్షలు..

రాజేంద్రనగర్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంగళవారం రాజేంద్రనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల్‌రాజ్, మాజీ కౌన్సిలర్ కె.ఎస్.దయానంద్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టినందుకు సన్మానించి శుభాకాంక్షలు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాలిగం చిత్తారి, సుధాకర్ రెడ్డి, హరినాథ్, మహాత్మా, శోభ, కుమార్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



శాసన సభ స్పీకర్‌ను సన్మానిస్తున్న కృష్ణారెడ్డి, తలారి ప్రేమ్‌కుమార్ తదితరులు

హరిచందనకు సన్మానం



హరిచందనను సన్మానిస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన హరిచందన దాసరిని మంగళవారం మున్సిపల్ కమిషనర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఆర్గనైజేషన్ సెక్రటరీ మల్ల గూడచారి, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్రలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి సన్మానించారు.

సమస్యలన్నీ పరిష్కారిస్తా



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసిన అసోసియేషన్‌ల నాయకులు

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలో వస్తున్న గేటెడ్ కమ్యూనిటీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే టీ. ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్, హాల్ మార్క్ విసినియా గేటెడ్ కమ్యూనిటీల సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నాలుగోవ సారి ఎమ్మెల్యేగా ఎన్నికయినందుకు శుభాకాంక్షలు తెలపటంతో పాటు తమ గేటెడ్ కమ్యూనిటీల ముందు వీది దీపాలు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెవెళ్ళారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీలతో పాటు గేటెడ్ కమ్యూనిటీల సమస్యలను ఎప్పటికపుడు తన దృష్టికి తెస్తే మున్సిపాలిటీలలో నిధుల లభ్యతను బట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మాదిగ మాన్యం భూమి కబ్జాకు యత్నం

లక్ష్మీకాపూల్: మాదిగ సామాజకవర్గానికి కేటాయించిన మాన్యం భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆ వర్గానికి చెందిన మాచర్ల నరేంద్ర, రాజు, విజయకుమార్‌లు ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం బేగంపేటలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. బాధితులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పొషెట్టి గూడలోని సర్వే నెం. 17, 18కి చెందిన 33 గుంటల భూమిని ప్రభుత్వం మాదిగ మాన్యంగా ఇచ్చిందన్నారు. అయితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిని అడ్డుపెట్టుకుని ఆ భూమిలోని 15 గుంటలను కబ్జా చేయడానికి డిసిసి అధికార ప్రతినిధి సులోచన మైలారం పూనుకున్నారని, అడ్డుకున్నందుకు తమపై దాడికి పాల్పడినట్టు ఆరోపించారు. తమ గ్రామానికి ఇచ్చిన భూమిని అన్యాక్రాంత చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ పార్టీకి అప్రదిష్ట కలిగించే విధంగా వ్యవహరిస్తున్న ఆమెను చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం

శంషాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ దొరికింది. ఈ నెల 14 రాత్రి మండలంలోని నర్కూడ శివారులో నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని బైక్ ఢీకొనగా.. ఉస్మానియాకు తరలించే సమయానికి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చారు. అయితే మృతుడు మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ వాసి కుమ్మరి కృష్ణగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు మంగళవారం మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

సెల్ టవర్ డీజిల్ చోరీ

శంషాబాద్ రూరల్: సెల్ టవర్ జనరేటర్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్‌ను దొంగిలించారు. ఇన్స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పాల్మాకులలో జీయో నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్ ఉంది. దీని కోసం అమర్చిన జనరేటర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్‌ను దొంగిలించారు. ఈ నెల 9న ఆన్‌లైన్ చెకింగ్‌తో విషయాన్ని గమనించిన సూపర్‌వైజర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల రోజుల నుంచి పెద్దషాపూర్‌తండా, రామంజాపూర్, గొల్లపల్లిలో ఉన్న జీయో సెల్ టవర్ జనరేటర్ల నుంచి డీజిల్ దొంగతనం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



విద్యుత్ డివిజనల్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పిఅండ్‌టి కాలనీ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: తరచు ఏర్పడుతున్న విద్యుత్ సమస్యల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పిఅండ్‌టి కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ డెలిగేషన్ సభ్యులు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పిఅండ్‌టి కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ సభ్యులు డివిజనల్ ఇంజనీర్ ఎల్రక్టికల్ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్ మార్జిన్‌ల పైన ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదన్నారు. అలాగే కరెంట్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. లైన్‌మెన్‌లు, ఇంజనీర్‌లు చొరవ తీసుకోని ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో లైన్‌మెన్‌లు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. 6వ డివిజన్ సి బ్లాక్‌లో ఆరు నెలల ముందు ట్రాన్స్‌ఫార్మర్‌ని పెట్టి వదిలేశారన్నారు. వెంటనే వీటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సమస్యలను డివిజనల్ ఇంజనీర్‌కు వివరించామని ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పిఅండ్‌టి కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ ఫిరాసత్‌హుస్సేన్ ఉర్ఫ్ నదీమ్, జనరల్ సెక్రటరీ అబ్దుల్ హఫీజ్‌ఖాన్, కుత్బుద్దీన్, మిస్బావుద్దీన్, హైదర్ ఆలీ తదితరులున్నారు.

ముందు జాగ్రత్తలతో కేన్సర్ నివారణ

లంగర్‌హౌస్: కేన్సర్, గుండె జబ్బులపై అవగాహనతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధులను అరికట్టవచ్చని రెనోవా ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ నగేష్, డాక్టర్ శివకుమార్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని రెనోవా ఆస్పత్రి, రోటరీ క్లబ్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా రాందేవ్‌గూడ, ఇబ్రహీంబాగ్, వాసవీ కళాశాల ప్రాంతాల్లో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది మహిళలకు ఉచితన కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గుండె జబ్బులు, ఆర్థోపెడిక్ సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ సంద్భంగా వైద్యులు మాట్లాడుతూ, సమాజానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం లక్ష్యంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా స్థానికులకు కాంప్లిమెంటరీ కార్డియో పరీక్షలు, ఆర్థోపెడిక్, ఎముకల పటిష్టత పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. శిబిరంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షూబ్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ జాబీ, డాక్టర్ ఆసిఫ్ మిర్జా, సంఘ సేవకులు రాజు వస్తాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి

విజయనగర్‌కాలనీ: విద్యార్థులకు మెరుగైన విద్య నందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్ అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ జేఎన్ఏఎఫ్ఏయూలో రిసాల్యూట్ కంపెనీ, ఏఆర్-వీఆర్ కోర్సుల ట్రెనింగ్ ఇచ్చే సంస్థ సైమాక్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన (ఎంఓయు) ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిసాల్యూట్ కంపెనీ హెడ్ లీగల్ అండ్ ఏపీఆర్ అడ్వకేట్ సుభజీత్ సాహో, సైమాక్స్ సంస్థ ఫౌండర్ ఆర్కిటెక్ట్ గౌరీశంకర్, జేఎన్ఏఎఫ్ఏయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ వి.ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 3,4 తేదీల్లో ఆల్ ఇండియా మహిళా కాన్ఫరెన్స్

గోల్కొండ: వచ్చే నెల 3,4వ తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా మహిళా కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు వాహిద్ అహ్మద్ అన్నారు. కాన్ఫరెన్స్ ఏర్పాటు విషయాలపై చర్చించడానికి మంగళవారం టోలిచౌకీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన కాన్ఫరెన్స్‌ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో విజయవంతం అయ్యాయని అన్నారు. అయితే ఈ సారి కూడా వీటిని విజయవంతం చేస్తామని అన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి



సూచనలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.ఇందిర

శంషాబాద్ రూరల్: రైతులు న్యాయ సేవాధికార సంస్థ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.ఇందిరా సూచించారు. మండలంలోని మల్కారం ఉన్న రైతు వేదికలో మంగళవారం రైతులు, సాగు చట్టాలు, న్యాయ సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి ఉచితంగా న్యాయ సహాయం అందుతుందన్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కోర్టుకు వెళ్లకుండా ఇక్కడ రాజీమార్గంతో న్యాయం పొందవచ్చన్నారు. రైతులు బయటి వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే ముందు ప్రాంసరీ నోటుపై పూర్తి వివరాలు రాసి, చదివిన తర్వాతనే మధ్యవర్తుల సమక్షంలో సంతకాలు చేయాలన్నారు. ఎలాంటి దస్త్రాలు లేని భూ పంపకాల వివాదాలను కూడా ఇక్కడ పరిష్కరించుకోవచ్చన్నారు. భూముల కొనుగోలు సమయంలో హద్దులను దస్త్రావేజుల్లో పొందుపర్చుకోవాలన్నారు. ఏడాదికి నాలుగు సార్లు మెగా లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్, రోడ్డు ప్రమాదాలు, బ్యాంకు రుణాలు, విద్యుత్ చౌర్యం వంటి కేసులను కూడా రాజీతో పరిష్కరించుకోవచ్చన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ







శిథిలావస్థకు గురైన రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, మట్టి రోడ్డు

అత్తాపూర్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అత్తాపూర్ మారింది. అత్తాపూర్ పాత విలేజీ నుంచి దర్గాకు వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. మంచినీటి లీకేజీలు ఒకవైపు.. మూతలు లేని మ్యాన్‌హోళ్లు మరోవైపు దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ దారుల నుంచి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్తాపూర్ పోచమ్మ దేవాలయం నుంచి హనుమాన్ టెంపుల్ వరకు నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రోడ్డు నిర్మాణాలను చేపట్టాలని సాంక్షన్ చేస్తూ టెండర్లను ఆహ్వానించినప్పటికీ... చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అత్తాపూర్ పాత విలేజీను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భూకబ్జాకు యత్నించిన వారిపై కేసు

శంషాబాద్ రూరల్: వ్యవసాయం పొలం పక్కనే ఉన్న వెంచరులో ప్లాటు కొనుగోలు చేసిన వ్యక్తులు అక్రమంగా భూమిలోకి చొరబడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తొండుపల్లి గ్రామానికి చెందిన బైతి కృష్ణకు ఈ గ్రామంలోని సర్వే నంబరు 139/ఇ/ఆలో 21 గుంటల పొలం ఉంది. ఇందులో వరి సాగు చేయగా.. ఇటీవలే వరి కోత చేపట్టారు. ఈ పొలం పక్కన ఉన్న న్యూప్లానెట్ వెంచరులో ప్లాటు కొనుగోలు చేసిన తొండుపల్లి చెందిన రాచమల్ల రాజ్‌కుమార్, సౌజన్యం దంపతులు మరి కొంత మంది మంగళవారం జేసీబీతో వచ్చి పొలంలో చదును చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై నాగరాజు

అత్తాపూర్: పార్కు చేసిన ఆటోను తగలబెట్టిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... చింతల్‌మేట్ ప్రాంతంలో ఉన్న ఉర్దూ పాఠశాల సమీపంలో గత మూడు నెలలుగా మూడు ఆటోలను తగలబెట్టారు. స్థానికంగా ఉన్న పేదలు ఆటోలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంటారు. మహ్మద్ ఖాజా పాషా (33) అనే వ్యక్తి స్థానిక ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాల సమీపంలో తన ఆటో (టీఎస్ 09యుబీ9362)ను పార్కు చేయగా..మధ్య రాత్రి ఒకటిన్నర గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కృషి చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

రాజేంద్రనగర్: ఆటో కార్మికులకు ఉపాధి చూపించి వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయు ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాలే రాజు ఆరాంఘర్ చౌరస్తాలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, ఆలిండియా ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జాజుల రుద్ర కుమార్ మాట్లాడుతూ... ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహాలక్ష్మి పథకం ప్రారంభించడంతో రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న 80 లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని వారికి ఉపాధి చూపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు గోనెల రాజు, అక్బర్, ఇమ్రాన్, వినోద్, బాబు, సత్తయ్య, రమేశ్, రఫి, శివ, తర్య నాయక్, వెంకటేశ్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు పెరుగుతున్న ప్రజాభిమానం

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజాభిమానం రోజు రోజుకూ పెరుగుతోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయనను గోల్కొండ బడా బజార్‌లో ఎస్ఎస్ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వరంలో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ తరపున తాను మూడవసారి అత్యధిక మెజార్టీతో గెలవడం పార్టీకి ఉన్న ఆదరణను తెలుపుతోందని అన్నారు. వరుసగా మూడవసారి తనను గెలిపించిన కార్వాన్ ప్రజలకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని, అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు.

దేవులపల్లి సుమాలికకు తెలుగు ఐకాన్ అవార్డు

అబిడ్స్: నగరానికి చెందిన దేవులపల్లి సుమాలికకు తెలుగు ఐకాన్ అవార్డు లభించింది. కెనడాలో జరిగిన తెలుగు వైభవంలో క్లాసికల్ డ్యాన్సర్‌గా, రెండు చేతులతో మిర్రర్ ఇమేజ్‌లో ఏకకాలంలో రాసినందుకు అవార్డు లభించింది. నాంపల్లిలోని టీసీటీఎన్‌జీఓ సెంట్రల్ అసోసియేషన్ నాయకుడు, అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి దేవులపల్లి శ్రీనివాసరావు కుమార్తె దేవులపల్లి సుమాలిక తెలుగు ఐకాన్ అవార్డు పొందడంతో పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. సుమాలికను సిఫా ఆధ్వర్యంలో అవార్డుతో పాటు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుమాలిక మాట్లాడుతూ, అవార్డు లభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతను నాంపల్లిలోని పలు వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయాల అధికారులు, సిబ్బంది అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

గోల్కొండ: షేక్‌పేట మారుతీనగర్‌లోని విజయగణపతి, గురుదత్తాత్రేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత అమ్మవార్ల 13వ వార్షిక మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పూస బాబూరావు ఆధ్వర్యంలో తోకల సాయిబాబు, కౌసల్య సౌజన్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గణపతి హోమం, 11 గంటలకు మహాక్షీరాభిషేకం, అలంకరణ, అర్చన, మంగళహారతీ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.